بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 16.05.2025 (Telugu)**

# సరాయా నేపథ్యంలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన, ఇద్దరు మృతుల సద్గుణాల ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 16.05.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

నేడు కూడా నేను సరాయా (యుద్ధాల)ను ప్రస్తావింతును. అనంతరం మరొక అంశాన్ని ప్రస్తావింతును.

సరయ్య అబూఖతాదహ్ అన్సారీ రజియల్లాహు అన్హు ప్రస్తావన లభిస్తుంది. ఇది ఖజ్‌రహ్ వైపు సంభవించెను. ఈ సరయ్య హిజ్రీ 8వ సం॥ షాబాన్ నెలలో జరిగెను. ఇక్కడ బనూ ఘత్ఫాన్ తెగలోని ఒక వర్గం నివసముంటుండెను. నజద్ ప్రాంతంలో ఖజ్‌రహ్ వద్ద నివాసముంటున్న బనూ ఘత్ఫాన్ మదీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్చర్యలకు పాల్పడుతుండెను. ఒక కథనం ప్రకారం ఈ యుద్ధం కొరకు అనుచరులు (రిజ్వానుల్లాహ్ అలైహిమ్) 15 రాత్రులు బయట గడిపిరి. రెండు వందల ఒంటెలు, ఒక వెయ్యి మేకలతో పాటు అనేక మంది ఖైదులను పట్టుకొని వచ్చిరి.

మరొక సరయ్య అబూఖతాదహ్ రజియల్లాహు అన్హు ఇజమ్ లోయ ప్రస్తావన గలదు. హిజ్రీ 8వ సం॥ రమజాన్ నెలలో అనగా క్రీ॥ శ॥ 630వ సం॥ జనవరిలో ఇది జరిగెను. ఈ సరయ్యకు గల కారణమేమనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా జయించుటకు బయలు దేరాలని సంకల్పించిరి. అప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం అబూఖతాదహ్ (రజి)ను ఇజమ్ లోయ వైపు పంపిరి. తద్వారా వారు సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాకు కాదు ఇజమ్ వైపు బయలు దేరినట్లు ప్రజలు భావించాలని ఇలా చేసిరి. ఒక కథనం ప్రకారం ఈ సరయ్యకు అమీర్‌గా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ హద్రద్ రజియల్లాహు అన్హు నియమించబడిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ హద్రద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మేము ఇజమ్ లోయ వరకు చేరుకున్నప్పుడు అక్కడ ఆమిర్ బిన్ అజ్‌బత్ అష్‌జయీ అనే వ్యక్తి మా సమీపం నుండి వెళ్ళెను. అతడు మా వద్దకు వచ్చినప్పుడు ఇస్లామీ పద్ధతిలో సలాం చేసెను. (నమస్కరించెను.) కావున అతనిపై దాడి చేయకూడదని ముస్లింలు నిర్ణయించుకొనిరి. కానీ హజ్రత్ ముహ్‌లిమ్ బిన్ జసామా లైసీ (రజి)కు అతనితో ఇంతకు ముందే ఏదో వివాదముండెను. కావున వారు ఆమిర్ బిన్ అజ్‌బత్ మీద దాడి చేసి అతన్ని హతమార్చిరి. అనంతరం అతని సామాగ్రి, అతని ఒంటెను స్వాధీనం చేసుకొనిరి. ఇది సంఘటన తప్ప శత్రువుల సైన్యంతో అనుచరులు తలపడలేదు.

ఎందుకనగా అన్యారాధకుల దృష్టిని మరల్చుడానికి మాత్రమే ఈ అనుచరులు పంపబడిరి. అందుకే అనుచరులు అక్కడి నుండి తిరిగి వచ్చేసిరి. ఇంతలోనే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాకు బయలు దేరిన విషయం వీరికి తెలిసెను. కావున వీరు కూడా అటు నుండి అటే అనగా మక్కాకు బయలు దేరిరి. మార్గమధ్యలోనే వీరు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కలుసుకున్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో భేటీ అయినప్పుడు ఈ హత్యోదంతాన్ని మొత్తం వినిపించిరి. అప్పుడు ఈ సూక్తి అవతరించెను. ఆ సూక్తి అనువదమిట్లు గలదు.

"ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ మార్గము నందు పయనించునప్పుడు సముచితమైన పరిశీలనము చేసుకొనుడు. శాంతిని ఆశించి మీకు నమస్కరించిన వానితో "నీవు విశ్వాసి కావు" అనకుము. మీరు ఐహిక ప్రపంచము నందలి పదార్థములను ఆశిస్తున్నారు. కాని అంత కంటే మంచి పదార్థములు అల్లాహ్ వద్ద అనంతములుగా ఉన్నవి. ఇంతకు పూర్వము మీరు కూడ ఇట్లే యుండిరి. అప్పుడు అల్లాహ్ మీకు ప్రత్యేకమైన అనుగ్రహమును ప్రసాదించెను. కనుక సముచితమైన పరిశీలనము చేయుము. నిశ్చయంగా మీరేమి చేస్తున్నారో అల్లాహ్‌కు బాగుగా తెలియును."

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సరయ్యా హిజ్రీ 8వ సం॥లో జరిగెను. కానీ ఇది అన్నిసా అధ్యాయపు 95వ సూక్తి. ఈ అధ్యాయం హిజ్రీ 3వ సం॥ నుండి 5వ సం॥ మధ్య అవతరించెననే ఎక్కువ ఆధారాలు గలవు. కావున ఈ సంఘటన తెలిసినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సూక్తిని చదివి తమ అసంతృప్తిని వ్యక్తపరచినారు కావచ్చును.

అనంతరం హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను జమాఅత్‌లోని ఒక పుణ్యాత్ములు, గొప్ప విద్యావంతులు, ఖిలాఫత్ వీరాభిమాని, సాటిలేని ధార్మిక సేవకుల గురించి ప్రస్తావింతును. కొద్ది రోజుల క్రితం వీరు మృతి చెందారు. ఇలాగే మరో అభిమాని, వినమ్రులైన అహ్మదీ గురించి కూడా ప్రస్తావింతును. వీరు కూడా ఇటీవలె ఖైదీలుగా ఉండగానే మృతి చెందారు.

మొదటి ప్రస్తావన సయ్యద్ మీర్ మహ్మూద్ అహ్మద్ నాసిర్ గారిది. వీరు హజ్రత్ సయ్యద్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ (రజి) కుమారులు. 96 సం॥ల వయసులో వీరు మృతి చెందారు. **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్**. వీరు హజ్రత్ అమ్మాజాన్ (రజి) సోదరుని కుమారులు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) మరియు హజ్రత్ మర్యమ్ సిద్దీఖహ్ (రజి) గారల అల్లుడు. ప్రాథమిక విద్యాభ్యాసం ఖాదియాన్‌లో పొందిరి. అనంతరం పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి బి.ఏ. పూర్తి చేసిరి. తమ తండ్రి హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ (రజి) గారు మృతి చెందిన రోజు 1944 మార్చి 17వ తేదీన తమ జీవితాన్ని సమర్పించిరి. అప్పుడు సయ్యద్ మహ్మూద్ అహ్మద్ గారి వయసు 14 సం॥లు ఉండెను. వీరి జమాఅత్ సేవలు ఇట్లు గలవు. 1954 నుండి 1957 వరకు వీరు ఇక్కడ ఇంగ్లాండ్‌లో ముబల్లిఘ్‌గా పని చేశారు. ఇక్కడ ఉన్నప్పుడే స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అఫ్రీకన్ స్టడీస్‌లో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) గారి ఆదేశం మేరకు చదువుకొనిరి. వీరు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిరాబె రహిమహుల్లాహు తఆలా వెంట ఉండిరి. 1957 నుండి 1959 వరకు వకాలతె దీవాన్‌లో రిజర్వ్ ముబల్లిఘ్‌గా ఉండిరి. అనంతరం 1960వ సం॥లో జామిఅలో బోధకునిగా నియమితులైరి. 1978 నుండి 1982 వరకు వకీలుత్తస్నీఫ్‌గా పని చేసిరి. 1986 నుండి 2010 వరకు జామిఅ అహ్మదియ్యా రబ్వా ప్రిన్సిపాల్‌గా

సేవలందించిరి. అదే కాలంలో 1994 నుండి 2001 రకు వకీలుత్తలీమ్‌గా కూడా ఉండిరి. ఇదే విధంగా రిసెర్చ్ సెల్, శిలువ సంఘటన సెల్‌కు ఇన్చార్జిగా ఉండిరి. 2005వ సం॥లో నూర్ ఫౌండేషన్ స్థాపించబడినప్పుడు దానికి అధ్యక్షునిగా నియమితులైరి. చివరి శ్వాస వరకు ఇదే సేవ చేస్తుండిరి. మజ్లిసె ఆఫ్తా సభ్యునిగా ఉండిరి. ఖుద్దాముల్ అహ్మదియ్యలో వివిధ హోదాలలో అనగా ముహ్తమిమ్, ఉపాధ్యక్షునిగా సేవ చేయు అనుగ్రహం పొందిరి. విద్యా మైదానంలో వీరు పవిత్ర ఖుర్ఆన్ అనువాదాన్ని తయారు చేయటలో సహకరించిరి, సహా సిత్త (హదీసు ఆరు సరియైన పుస్తకాల)తో పాటు ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ ఉర్దు అనువాదం చేసిరి. సహీ ముస్లిం, షమాయిలె తిర్మిజీ విశ్లేషణ వ్రాశారు, బైబిల్ మీద విజ్ఞానవంత వ్యాసాలు వ్రాశారు. కఫనె మసీహ్ (మసీహ్ శవ వస్త్రం), మర్‌హెమ ఈసా (ఈసా గాయాలకు కట్టిన ఔషధ పట్టి) గురించి పరిశోధనాత్మక పని చేశారు. ముద్రించబడిన వీరి పుస్తకాలు ఇట్లు గలవు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర గురించి మూడు భాగాలు, నమాజ్ తార్వత ప్రతి రోజు దర్స్ కొరకు ఒక పుస్తకం. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) తమ కుమార్తెతో వీరి నికాహ్ చదివించిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ (రహ్మ) వీరి కుమారుని నికాహ్ చదివించిరి.

మజ్లిసె శూరాలో తమ అభిప్రాయాన్ని వెల్లడించి నందుకు 1990వ సం॥లో వీరి మీద ఒక వాజ్యం మోపబడెను. న్యాయమూర్తి వారితో ఇట్లనెను. మీరు తమ ఉపన్యాసంలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను, అనుచరులను అవమానించారు. బదులుగా మీర్ గారిట్లనిరి. ఇది నాపై ఆరోపణ, ఇది పచ్చి అబద్ధం. నేను హృదయపూర్వకంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను, అనుచరులను గౌరవిస్తాను. వారి ప్రవక్తుత్వాన్ని విశ్వసిస్తాను. న్యాయమూర్తి సమక్షంలో వారెంతో ధైర్యంగా ఇలా వాంగ్మూలమిచ్చారు. ధార్మిక విద్యలలో ఇస్లాంతో పాటు యూదు మతం, క్రైస్తవ మతం మొ॥ను కూడా పఠించారు. మతాల మధ్య గల పోలికల గొప్ప జ్ఞానం వీరికుండెను. ఎల్లప్పుడు వారిట్లు ఉపదేశించేవారు. పవిత్ర ఖుర్ఆన్, ప్రవక్త సున్నత్ అనగా ఆచరణ, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం, వారి (అ) ఉత్తరాధికారుల సాహిత్యం నుండి మార్గదర్శకం పొందండి.

ముబష్షిర్ అయాజ్ గారిట్లు వ్రాశారు. మీర్ గారు ఎంతో అమాయక, పవిత్రమైన జీవితం గడిపారు. చాలా సున్నిత మనస్కులు కానీ నిరాడంబరులుగా ఉండిరి. ఉన్నదానిలో తృప్తిపడుట, దైవ నమ్మకంలో వారికెవరు సాటిలేరు. విద్య, విజ్ఞాన సాగరులుగా ఉండిరి. చాలా గొప్ప విద్యావంతులు. పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషకులు, హదీస్ విశ్లేషకులుగా ఉండిరి. పవిత్ర ఖుర్ఆన్ అనువాదంతో పాటు మొత్తం ఆరు ప్రథమ హదీసు పుస్తకాల అనువాద అనుగ్రహం పొందిన మొదటి అదృష్టవంతులు అహ్మదియ్యా జమాఅత్ చరిత్రలో వీరే ఉన్నారు.

తన్వీర్ నాసిర్ అహ్మద్ గారు మురబ్బి ఖాదియాన్ నుండి ఇట్లు వ్రాశారు. వారి గురించి నాకొక విషయం ఎల్లప్పుడు గుర్తుంటుంది. అదేమనగా ఒక రోజు ఖాదియాన్‌లోని మస్జిద్ ముబారక్‌లో నేను కూర్చొని ఉండగా మీర్ గారు మస్జిద్ మొదటి వరుసలో అటు ఇటు నడుస్తుండిరి. వారిలా నడుస్తు దుఆలు చేయుట నాకు చాలా ఉత్సాహం కలిగించెను. కొంత సమయం తర్వాత నేను ధైర్యం కూడగట్టుకొని మీరు మస్జిద్ మొదటి వరుసలో ఎందుకు నడుస్తున్నారు? దీనికి గల కారణమేమిటి? అని వేడుకున్నాను.

అప్పుడు వారిట్లు తెలిపిరి. ఇచట నడుస్తుండగా నేను హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి)ను చూశాను. వారి అడుగు జాడలలోనే నడవాలని నేను ప్రయత్నిస్తున్నాను. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి)తో వీరికి విచిత్ర అభిమానముండెను.

మొత్తమ్మీద ఒక గొప్ప సహాయకారి, సానుభూతిపరులు, వీరాబిమాని, ప్రతి అక్షరాన్ని పాటించేవారు, విశ్వసనీయులుగా ఉండిరి. ఇటువంటి గొప్ప సహాయకారులు తక్కువే లభిస్తుంటారు. పాటించే విద్యావంతులుగా ఉండిరి. ప్రస్తుతం వీరి లాంటి వ్యక్తి నాకిప్పుడైతే ఎవరు కనిపించడం లేదు. అల్లాహ్ నిధిలో ఎలాంటి లోటు లేదు. వీరి లాంటి వ్యక్తులు ఇంకొందరు జన్మింతురు గాక! వీరి వలె విశ్వసనీయులు, వినమ్రులు, నిష్టాపరులైన సహాయకారులు అల్లాహ్ తఆలా జమాఅత్‌నకు ప్రసాదిస్తుండుగాక!

రెండవ ప్రస్తావన మరో అహ్మదీ డాక్టర్ తాహిర్ మహ్మూద్ తండ్రి గులాం రసూల్ కరాచీ గారిది. ఇటీవలె వీరు ఖైదీగా ఉండగానే మృతి చెందారు. **ఇన్నా లిల్లాహి వఇన్నా ఇలైహి రాజిఊన్.** మృతులు తాహిర్ మహ్మూద్ గారు మలేర్ కాలోనీ కరాచీ సదర్‌తో పాటు మరో ఇద్దరిని మలేర్ కాలోని కరాచీలో అహ్మదియ్య మస్జిద్ వంటి దాన్ని నిర్మించి, అక్కడ జుమా నమాజ్ చదివిన విషయాన్ని సాకుగా చూపి బంధించారు. న్యాయస్థానంలో వ్యతిరేకుల సమూహం వీరిపై దాడి చేసెను. పోలీస్ స్టేషన్‌లో కూడా వీరు హింసకు గురైరి. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం, ఉత్తరాధికారులను దూషించాలని వీరిని బలవంతం పెట్టిరి. కారాగారంలో రెండు నెలలున్నారు. కొన్ని రోజుల క్రితం మూత్ర పిండాలలో ఇన్ఫెక్షన్ కారణంగా అనారోగ్యానికి గురైరి. ఆసుపత్రిలో మృతి చెందారు. మృతి చెందినప్పుడు ఆసుపత్రిలో కూడా వీరి చేతులకు బేడీలు ఉండెను. కారాగారంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ విధంగా వీరు షహీద్ (అమరులు) అయినారు. వసియ్యత్ వ్యవస్థలో చేరి యుండిరి. సదర్‌గా, ప్రచార కార్యదర్శిగా సేవలందించారు. వీరి జ్ఞాపకార్థం భార్యతో పాటు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులున్నారు. కుమారుడు మురబ్బి సిల్సిలగా ఉన్నారు. నమాజ్ తర్వాత పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని రెండవ ఖుత్బా కంటే ముందు హుజూరె అన్వర్ ప్రకటించిరి.

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔